ప్రజాశక్తి

మంగళవారం 21 నవంబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

వేట సాగక..పూట గడవక..

- ఉన్న మత్స్యసంపదను లాక్కుపోతున్న కడలూరు బోట్లు
- మత్స్యకారుడికి నిత్యం కష్టాలే.
- నేడు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



వలలు బాగు చేసుకుంటున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

సముద్ర తీరం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా ఉంది. కడలూరు బోట్లు ఉన్న మత్స్యసంపదనంతా తీసుకొని పోతుండటంతో ఇక్కడి మత్స్యకారులకు వేట సరిగ్గా సాగటం లేవు. పూట గడవడమే కష్టమవుతోంది. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కడలి పుత్రుల కష్టాలపై 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం.

జిల్లాలోని శింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం మండలాలల్లో సముద్ర తీరప్రాంతం ఉంది. ఈ ప్రాంతాల్లోని 22 గ్రామాల్లో మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. సముద్రంపై ఆధారపడి బతుకుతున్నారు. సముద్రంలోని ఆటుపోట్లలాగే వీరి జీవనం కూడా ఉంది. నిత్యం సముద్ర వేటకు వెళ్లి వేట సాగించే మత్స్యకారులకు గత సంవత్సరం నుంచి కష్టాలు తీవ్రమయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు నుంచి సోనా బోట్లు వచ్చి ఇక్కడి మత్స్యకారుల కళ్ల ముందే మత్స్యసంపదను దోచుకుపోతుంటే మత్స్యకారులు చూస్తూ ఉండటం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ యంత్రాంగం సోనా బోట్లు వచ్చాయని తెలుసుకొని హడావుడి చేయటం తప్ప ఆపే పరిస్థితి లేకపోవడంతో మత్స్యకారులు ఎవరికీ చెప్పుకోలేక తల్లడిల్లిపోతున్నారు. కడలూరు నుంచి వచ్చిన సోనా బోట్లు ప్రతిరోజూ నెల్లూరు జిల్లాలో వేట చేసి.. అక్కడి నుంచి ప్రకాశం జిల్లాకి వచ్చి మత్స్యసంపదను దోచుకుపోతున్నాయి. మత్స్యశాఖ అధికారులు కూడా మత్స్యకారుడికి అండగా ఉండకుండా చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. ఎవరు చెప్పినా కూడా సోనా బోట్లను ఆపే పరిస్థితి ఇక్కడ సమస్యగా మారింది. సోనా బోట్లు ఒక్కసారి వచ్చి వెళ్లిపోతే క్వింటాళ్లకు క్వింటాళ్ల చేపలను లాక్కుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. సోనా బోట్లను కట్టడి చేసేందుకు మెరైన్ పోలీసుల చేసిన ప్రయత్నాలు ఫలితాలనివ్వలేదు. మత్స్యకారులకు రావలసిన బోట్లు, వలలు, ఇంజన్ల సబ్సిడీ ఈ ప్రభుత్వంలో వారికి దూరమయ్యాయి. వేట నిషేధం సమయంలో రెండు నెలలపాటు మత్స్యకారుల్ని వేటకు వెళ్ళనీయకుండా నిలుపుదల చేసినప్పుడు రూ.10 వేలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. రెండు నెలలు వేట ▶ 2లో

ఆరుతడికి నీరెలా.?

- ఆందోళన చెందుతున్న రైతులు
- రబీలోనూ కొనసాగుతున్న వర్షాభావం
- పంటల సాగూ ప్రశ్నార్థకంగా మారిన దైన్యం



కొండపిలో పొగాకు తోటకు బిందెలతో నీళ్లు పోస్తున్న రైతులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పొగాకు నాట్లకు ట్యాంకర్లతో నీటిని తెచ్చి పోస్తున్నారు. ఇంజన్లతో మిర్చి తోట లను తడుపుకుంటున్నారు. కొమ్మమూరు కాలువ కింద సాగుచేసిన వరి నీళ్లు అందక ఎండుతోంది. ఇంకా సాగు కావాల్సిన పంటలు 80 శాతం పైగానే మిగిలే ఉన్నాయి. అటు వర్షాలు లేవు. ఇటు సాగర్ నీళ్లు లేవు. దీంతో రైతులు వ్యవసాయం ఎలా చేయాలనే దానిపైనే సందిగ్ధంగా ఉన్నారు. చాలా వరకూ భూములు ఖాళీగానే ఉన్నాయి. అన్ని పంటలకూ ఏదో రూపంలో నీరు కావాలి. ఇప్పుడు దాని కోసం ఎదురుచూస్తున్నారు. ఎక్కడా కనిపించడం లేదు.

రబీలో వర్షాధారం కన్నా సాగునీటిపైనే ఆధారపడి 4.50 లక్షల ఎకరాల్లో వరితో పాటు పొగాకు, ఇతర ఆరుతడి పంటల సాగు జరుగుతుంది. ఇప్పుడు కాలువలకు నీళ్లు లేవు. వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటాయి. బోర్లలోనూ నీళ్లు లేవు. ఖరీఫ్ నుంచీ కరువు వెంటాడు తోంది. ఇప్పుడూ తరుముతోంది. శాస్త్ర వేత్తలు చేపట్టిన సర్వేలోనూ నీటి వనరులు ప్రమాదంలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పంటలకు కనీసం ఒకటీరెండు తడులకు కూడా నీళ్లు అందుబాటులో లేని పరిస్థితే ఎదురైంది. సాగర్ కాలువల ద్వారానే ఏటా 50 టిఎంసీల వరకూ జిల్లాకు వస్తోంది. ఇప్పుడు తాగునీళ్లకు 3 టిఎంసీలు ఇవ్వడానికే గగనమైంది.ప్రస్తుతం పొగాకు నాట్లు వేస్తున్నారు. రబీలో కీలకమైన వాణిజ్యపంట ఇదే.. జిల్లాలో 27,345 వేల హెక్టార్లలో పొగాకు సాగుకు అనుమతి ఉంది. అయితే ప్రస్తుతం 7,676 హెక్టార్లకు మించి నాట్లు పడలేదు. మరో వారం రోజుల్లోనే వీటికి నీళు పెట్టాలి. తడులు పెట్టాలి. లేకుంటే ఎండిపోతాయి. ముందుగా వేసిన చోట్ల ఇప్పటికే నీళ్ల అవసరం ఉంది. రైతులు వాగులు, వంకలను ఎతుక్కుంటున్నారు. పొగాకు సాగు ఇప్పుడు పెద్ద సందిగ్ధంలో పడింది. నాట్లు వేయడమా? లేక ఆపేయడమా? అనేది రైతులు కొన్నిచోట్ల తేల్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. పశ్చిమాన పత్తి, మిర్చి సాగు చేశారు. పూతపిందె దశలో ఉంది. మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల, వైపాలెం మండలాల్లో ఇప్పుడు పత్తి, మిర్చికి నీళ్ల అవసరం ఉంది. బోర్లపైనే ▶ 2లో

నకిలీ విత్తనాలతో నష్టాల బాట


- మోసపోయిన వరి రైతులు
- న్యాయం చేయాలంటూ స్పందనలో ఫిర్యాదు



ఒక పక్క కంకి వచ్చిన వరి పైరు (మంచి విత్తనాలతో సాగు చేసింది..)
మరొక పక్క పొట్టదశలో వేసిన వరి పైరు (నకిలీ విత్తనాలతో వేసింది..)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులు నకిలీ విత్తనాల కారణంగా నష్టపోయారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సక్రమంగా వర్షాలు లేక, పంట కాలువల ద్వారా సక్రమంగా సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ కాలపరిమితి గల వరి పంట రకాల వైపు మొగ్గు చూపారు. ఈ మేరకు తమతమ గ్రామాల్లో అందుబాటులో ఉన్న దుకాణదారుల నుంచి వరి విత్తనాలు కొనుగోలు చేశారు. ఎంటియు 1224 రకం వరి విత్తనాలు తక్కువకాలంలో అధిక దిగుబడి ఇస్తాయన్న ట్రేడర్స్ చెప్పిన మాటలు నమ్మి రైతులు విత్తనాలు కొని సాగు చేశారు. రైతులు జిల్లాలోని నగరం మండల కేంద్రంలో వున్న శ్రీనివాస ఎంటర్ ప్రైజెస్‌లో గ్రోవెల్ సీడ్స్ కంపెనీకి చెందిన ఎంటియు 1224 రకం వరి విత్తనాలు కొన్నారు. సదరు షాప్ యజమాని రైతులకు వారి పేరుతో బిల్లులు ఇవ్వకుండా చల్లపల్లిలోని శ్రీ దుర్గా భవాని ట్రేడర్స్ నుంచి వేరే రైతుల పేరుతో వచ్చిన బిల్లులను వీరికి చూపించారు. ఈ విత్తనాల వల్ల ఎలాంటి ఇబ్బందీ లేదని, తమదీ భరోసా అని విత్తనాలు అమ్మారు. ఇవి మంచి విత్తనాలని సదరు షాప్ యజమాని ధృవీకరించి చెప్పడం తో రైతులు ఆ



గ్రోవెల్ సీడ్స్ కంపెనీకి చెందిన బిల్లు

విత్తనాలు తెచ్చి వరి పైరు సాగు చేశారు. అయితే 130 రోజుల్లో పంట చేతికి రావలసిఉండగా ఇంకా పొట్టదశలోనే తమ వరి పైరు ఉండటంతో రైతులు ఆందోళన చెందారు.

వీరితో పాటు అదే నెంబర్‌తో వచ్చిన వరి విత్తనాలు సాగుచేసిన ఇతర రైతుల పొలాల్లో వరి కోతకు రాగా వీరి పొలాల్లో వరి ఇప్పుడు పొట్ట దశలో వుంది. మరో నెలకు కానీ వరి పైరు దిగుబడి ఎలా ఉంటుంది అనే సంగతి తెలియదు. తాము నష్టపోతున్నామని గ్రహించిన విత్తనాలు అమ్మిన షాపు వారిని ప్రశ్నించడంతో చల్లపల్లి నుంచి దుర్గాభవాని ట్రేడర్స్ వారు వచ్చి వరి పొలాలు పరిశీలించి వెళ్లారు. ఏ విషయమూ చెప్పలేదు. మరికొందరి వరి పొలాల గురించి వారెవరు పట్టించుకోలేదు. అయితే చుట్టుపక్కల పొలాలకు సంబంధించి వరి పైరు కోతకు వస్తున్న సమయంలో ఆ ప్రాంతాలకు రైతులు సాగునీటిని నిలిపివేస్తున్నారు. కాలువ చివరి భూముల్లో నకిలీ విత్తనాలతో సాగు చేసిన వరి పొలాలకు నీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితి తలెత్తుతుంది. ఎమ్‌టియు 1224 రకం కాకుండా వేరేరకం విత్తనాలను రైతులకు ట్రేడర్లు అంటగట్టిన క్రమంలో ఈ వరి పైరు ఎప్పుడు కోతకు వస్తుందో అర్థం గాని పరిస్థితి నెలకొంది. నకిలీ విత్తనాలతో వేసిన వరి పైరు ఇప్పుడు పొట్టదశలో ఉన్నందున సక్రమంగా ▶ 2లో



బోల్తా పడిన తుపాన్ వాహనం

తుపాన్ వాహనం బోల్తా

- ఒకరు మృతి
- 12 మందికి గాయాలు
- టైర్ పేలడంతో ప్రమాదం

2లో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

200 మంది భూకబ్జాకోరులు పరార్..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలులో భూకబ్జాకోరులు భారీగానే ఉన్నారని స్పష్టమైంది. ఎందుకంటే ఇప్పటికే 200 మంది కబ్జాకోరులు నగరం విడిచిపెట్టి పరారయ్యారని స్వయంగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మీడియా సమావేశంలోనే ప్రకటించారు. వారు ఎక్కడున్నా పట్టుకొని లోపల వేయడం ఖాయమని స్పష్టం చేశారు. ఎవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. సిట్ వేయడం వల్లనే ఇదంతా జరిగిందని చెప్పారు. ఆ ఘనతా తమదేనన్నారు. ఏదేమైనా నగరంలో భూకబ్జాకోరులు ఇంతమంది ఉన్నారంటే ఇక్కడ ఈ పరిస్థితులు తలెత్తడానికి కారకులు ఎవరు? తెరచాటు వీరికి అండదండలు అందించిందెవరు? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టాలి. కీలకమైన వ్యక్తులను వదిలేశారన్న విమర్శలకు తెరదించాల్సిన అవసరం ఉంది.

ఆరుతడికి నీరెలా.?

(మొదటిపేజీ తరువాయి)

ఆధారపడ్డారు. అందుబాటులో ఉన్న చోట్ల తడులు పెడుతున్నారు. బోర్లు ఎండినచోట్ల రైతులు అవస్థలు పడుతున్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. రబీ పంటల సాగు కూడా ముందుకు సాగలేదు. రబీలో సాధారణ విస్తీర్ణం 1.73 లక్షల హెక్టార్లు గాకా ఇప్పటివరకూ 20 శాతం విస్తీర్ణంలోనూ సాగు జరగలేదు. వాస్తవానికి ఇప్పటికే 80 శాతం పంటల సాగు జరగాల్సి ఉంది. నెలన్నర కావస్తున్నా వర్షాలు కురవలేదు. దీంతో పంటల సాగు చేపట్టలేక పోతున్నారు. వరి సాధారణ విస్తీర్ణం 24,430 హెక్టార్లు ఉండగా 2,433 హెక్టార్లలో వేశారు. దీనికి నీరు లేదు. సాగర్ ఆయకట్టులో పూర్తిగా మానేశారు. శనగ 55,399 హెక్టార్లకు గానూ 602 హెక్టార్లలో సాగు చేశారు. జొన్న 7,467 హెక్టార్లకు గానూ 4,181 హెక్టార్లు, మొక్కజొన్న 2,493 హెక్టార్లు సాగుచేశారు. అదే ఖరీఫ్‌లో 2.17లక్షల హెక్టార్లకు గానూ 1.24 లక్షల హెక్టార్లలో పంటల సాగు జరిగింది. ఇవి కూడా ఆశాజనకంగా లేవు. వర్షాల్లేక ఎండుతున్నాయి. అధికంగా కంది పంట 79 వేల హెక్టార్లకు గానూ 45 వేల హెక్టార్లలో వేశారు. మిగతావన్నీ 50 శాతం లోపే సాగు చేశారు. ఇవి కూడా ఎండుముఖం పట్టాయి. వర్షాల పరిస్థితి చూస్తే ఇప్పటికీ లోటు కొనసాగుతోంది. అక్టోబరులో 205.1 మి.మీ.లకు గానూ 12.1 మి.మీ.లు కురిసింది. 94 శాతం లోటు ఉంది. నవంబరులో 136.2 మి.మీ.లకు గానూ ఇప్పటివరకూ 65.8 మి.మీ.లు కురిసినట్లు నమోదైంది. వాస్తవానికి ఈ సమయానికి 106.1 మి.మీ.ల వర్షం కురవాలి. అంటే ఈ నెలలోనూ వర్షాభావం కొనసాగుతోంది. ఇలా రబీలోనూ పంటలపై కరువు ప్రభావం తీవ్రంగానే ఉంది. కోట్లాది రూపాయల నష్టం జరిగేలా ఉంది. పశు గ్రాసం కొరత రానుంది. వ్యవసాయకూలీలకు పనులు లేకుండా పోయాయి. అందరూ నష్టపోతున్నారు. ఏదేమైనా ఈ ఏడాది ఒక వైపు కరువు, మరో వైపు సాగునీరు రాక రైతులు విలువైన పంటలను, ఆదాయాలను కోల్పోతున్నారు.

వేట సాగక.. పూట గడవక..

(మొదటిపేజీ తరువాయి)

ఆగితే 25 వేల రూపాయలు ఇవ్వాలని ఇప్పటికే మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. మత్స్యకారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపడతానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని మత్స్యకార నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఓ పక్క సోనా బోట్లతో అల్లాడిపోతుంటే మరో పక్క పూర్తిస్థాయిలో వేట సాగక కొంతమంది మత్స్యకారులు వేటను ఆపివేసుకొని బేల్దారు పనులు కూడా వెళుతున్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం పేరుతో ప్రభుత్వ పెద్దలు హడావుడి చేయడం తప్ప తమ కష్టాలు తీర్చే వాళ్లు లేరని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ విత్తనాలతో నష్టాల బాట

(మొదటిపేజీ తరువాయి)

సాగు నీరు అందకపోతే తాలుకంకెలు వచ్చి మరింతగా నష్టపోతామన్న భయంలో రైతులున్నారు. ఈ వరి పంట ఆలస్యంగా వస్తున్నందున ఈ రైతులు రెండో పంటను వేసుకునే అవకాశాన్ని కూడా కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్లో జరిగిన స్పందనలో ఈదుపల్లి గ్రామానికి చెందిన రైతు చింతల కుమార్‌బాబు, ఆవలవారిపాలెం గ్రామ రైతు చందు సుందరయ్య వచ్చి నకిలీ విత్తనాల విషయమై ఫిర్యాదు చేశారు. ఈ నకిలీ విత్తనాల విషయమై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. గ్రోవెల్ సీడ్స్ కంపెనీకి చెందిన సదరు వరి విత్తనాలను చల్ల పల్లికి చెందిన శ్రీ దుర్గా భవాని ట్రేడర్స్ నుంచి పలు ప్రాంతా లకు చెందిన రైతులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

శాస్త్రవేత్తలను పంపి విచారణ చేయిస్తాం..

జిల్లాలోని నగరం, చెరుకుపల్లి మండల గ్రామాల్లో నకిలీ వరి విత్తనాల విషయమై బాధిత రైతులు చేసిన ఫిర్యాదు మేరకు ఈ వరి పొలాలకు శాస్త్రవేత్తలను పంపి విచారణ చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ చెప్పారు. మండల వ్యవసాయాధికారులు సదరు వరి పొలాలను పరిశీలిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలనుంచి వచ్చే నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన ట్రేడర్ల లైసెన్స్‌లను రద్దు చేసి రైతులకు పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.



మృతిచెందిన మహిళ

తుపాన్ వాహనం బోల్తా

ఒకరు మృతి.. 12 మందికి గాయాలు - టైరు పేలడంతో ప్రమాదం

ప్రజాశక్తి-మార్కాపురం

తుపాన్ వాహనం టైరు పేలడంతో అదుపు తప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న వారిలో ఓ మహిళ మృతి చెందగా మరో 12 మంది గాయపడ్డారు. వారిలో ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాద ఘటన మార్కాపురం మండలం చింతకుంట సమీపంలో అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. ప్రమాద బాధితులంతా మహారాష్ట్రలోని షోలాపూర్ ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. తెలిసిన వివరాల మేరకు.. మహారాష్ట్రలోని షోలాపూర్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి తుఫాన్ వాహనంలో తీర్థయాత్రలకు బయలుదేరారు. శ్రీశైల పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో వాహనం టైరు పేలిపోవడంతో అదుపు తప్పి నాలుగు పల్టీలు కొట్టింది. డ్రైవర్‌తో సహా అందులో ప్రయాణిస్తున్న 13 మంది గాయపడ్డారు. వీరిలో ఓ మహిళ మృతి చెందింది. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమయంలో స్థానికులు బాధితులను కాపాడే ప్రయత్నం చేశారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ వాహనాల్లో మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ట్రైనీ డిఎస్‌పి షేక్ సహనాజ్ అహ్మద్, మార్కాపురం సిఐ ఎం భీమానాయక్, మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్ తమ సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

సైకో పోవాలి సైకిల్ రావాలి: డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి:

కనిగిరి మునిసిపాలిటీలో 19వ రోజు సోమవారం సాయంత్రం సూరా పాపిరెడ్డి నగర్, కాశీపురంలో మన ఊరు మన ఉగ్ర, భవిష్యత్తుకు గ్యారెంటీ బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సైకో పోవాలి సైకిల్ రావాలని ప్రజల కోరు కుంటు న్నారన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఉగ్ర

జాయింట్ అకౌంట్ జీవోను రద్దు చేయాలి

ఆర్‌డిఒకు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - రేపల్లె

విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు తల్లి ఖాతాతో విద్యార్థికి కూడా ఉమ్మడిగా బ్యాంకు ఖాతా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల విద్యార్థులకు నష్టమని, ఈ జీవో ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒకు గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు పి. మనోజ్ కుమార్ మాట్లాడుతూ విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు ప్రారంభం నుంచి తల్లి ఖాతాలో నిధులు జమ చేస్తున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా విద్యార్థిని కూడా చేర్చి జాయింట్ అకౌంట్ చేయడం వల్ల కొత్తగా వచ్చే ప్రయోజనం ఏమటని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యా దీవెన పథకంలో నాలుగు దఫాలలో చివరి దఫా గత



ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రెండు సంవత్సరాలు అమలు చేయలేదని అన్నారు. వసతి దీవెన రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ.10వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. పథకాలు అమలు చేయడంలో చిత్తశుద్ధి లేకుండా కోతలు విధించి, నిధులు మిగిల్చుకునే డొంకతిరుగుడు విధానాలు తీసుకురావడం సిగ్గుచేటన్నారు. కొత్తగా నిబంధనల వల్ల ప్రయోజనం లేకపోగా అనేకమందికి నష్టం జరుగుతుందన్నారు. పెడింగ్‌లో ఉన్న రూ.1600కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ అకౌంట్ నిబంధనల వల్ల విద్యార్థులు క్లాసులు మానుకొని బ్యాంకుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని నష్టపోతున్నారన్నారు. ఈనెల 28నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల పరీక్షలకు సిద్ధం కాకుండా బ్యాంకులు చుట్టూ తిరుగుతూ ఉంటే ఏ విధంగా విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో పెట్టుకుని కొత్తగా విధించిన నిబంధనలు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి సూర్య, హేమశ్రీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - రేపల్లె

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారు. అందులో భాగంగా ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం సమ్మె నోటీసుఅందజేశారు. ఈ సదర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షుడు సిహెచ్. మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రోజువారి పని ఒత్తిడి పెరగటం,



సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

యాప్స్ పేరుతో అంగన్‌వాడీలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. నిత్యాసరాల ధరలు పెద్ద భారీగా పెరిగినట్లు తెలిపారు. అయినప్పటికీ వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తెలంగాణా కంటె రూ.1,000 అదనంగా వేతనం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం, లబ్ధిదారులకు అవసరమైన నాణ్యమైన ఆహారం సరఫరా చేయకపోవడం వంటి సమస్యలు కోకొల్లలు ఉన్నాయన్నారు. వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. సమ్మెకు ముందు దశలవారీగా ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ (సిఐటియు) ప్రాజెక్ట్ కార్యదర్శి కె.వాణి, నాయకులు ఎన్.కష్ణకుమారి, డి.జ్యోతి, రజిని పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ

ప్రజాశక్తి-మార్కాపురం

గ్రంథాలయాల సేవలు వెలకట్టలేమని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ సూచించారు. గ్రంథాలయాల్లో బోలెడు విజ్ఞానం దాగివుందన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు సభకు గ్రంథపాలకుడు గాయం శివారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తర్లుపాడు జడ్‌పిటిసి వెన్నా ఇందిర పాల్గొని మాట్లాడారు. తాను ఉపాధ్యాయురాలిగా ఉన్న సమయంలో గ్రంథాలయాల విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. తాను కూడా గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందిచుకున్నట్లు తెలిపారు. ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలకు రావడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు గ్రంథాలయాల్లోని సమాచారం దోహదపడుతుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎన్‌జఉమాదేవి, సయ్యద్ అమీనా, జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఒద్దుల వీరారెడ్డి, సెయింట్ ఆన్స్ పాఠశాల ఉపాధ్యాయురాలు శ్యామ్‌మేరీ, సామాజిక కార్యకర్త కొల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు. **సంతనూతలపాడు :** స్థానిక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణ

విద్యాశాఖ అధికారి డి. వెంకారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వాటిని చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోచ్చునని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.రామారావు, ఉపాధ్యాయురాలు మాధవీలత, గ్రంథపాలకుడు, విద్యార్థులు పాల్గొన్నారు. **కొత్తపట్నం :** స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపియుపి స్కూల్ హెడ్మాస్టర్ కె. శారదా సునీత, జడ్‌పిహెచ్‌ఎస్ సీనియర్ ఉపాధ్యాయురాలు కె.ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశలో నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతి రోజు ఉదయం,సాయంత్రం పూట గ్రంథాలయానికి వచ్చి తమకు నచ్చిన పుస్తకాలు చదవాలన్నారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం, వినోదం, జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, కె. వెంకట శేషారావు , వికాస్ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు నిశాంతి, గ్రంథపాలకుడు అజయ్ బాబు పాల్గొన్నారు. **పెద్దారవీడు :** స్థానిక శాఖా గ్రంథలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు గ్రంద పాలకుడు వై.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు సర్పంచి చెన్నమ్మ, జడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయుడు జనార్ధన్, కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మావతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు వై.వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లలచెరువు :** 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బడిపాటి ఓబుల్ , బుక్ డిపాజిటర్ కప్పలకుంట బాలు నాయక్, సరస్వతీబాయి, ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకుడు బాదుల్లా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

గ్రానైట్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-చీమకుర్తి

హంస గ్రానైట్‌లో పనిచేస్తున్న కార్మికుల పిఎఫ్ బకాయిలు యాజమాన్యం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒంగోలులోని పిఎఫ్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ హంస గ్రానైట్ మేనేజ్‌మెంట్ గత నాలుగేళ్లుగా కార్మికుల జీతాల్లో పిఎఫ్ కట్ చేస్తూ పిఎఫ్ సంస్థకు కట్టకుండా సొంతానికి వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయం గురించి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. దీంతో గత్యంతరం లేక కార్మికులు ఆందోళన బాట పట్టాల్సివచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులు పిఎఫ్ బకాయిలు యాజమాన్యం కట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు టి.రాము, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, యూనియన్ నాయకులు జి.అప్పల నాయుడు, కనకరాజు, వెంకటేశ్, రమణ, జానీ, బ్రహ్మయ్య, ఖలీల్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరాములు

పోరాటాల ఫలితమే బీసీ కులగణన : శ్రీరాములు

యర్రగొండపాలెం : బీసీ కులగణనకు ఆమోదం తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభినందనీయులని జాతీయ బీసీ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు పోసాని శ్రీరాములు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి బీసీ కులగణన చేయాలని అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వాలు ముందుకు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రలోబీసీ కులగణనకు ఆమోదాన్ని తెలిపిన జగన్మోహన్ రెడ్డి నిర్ణయం చాలా సాహ సోపేతమైనదన్నారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ కోశాధికారి నార్నపాటి పోలయ్య ,మండల ప్రధాన కార్యదర్శి గుర్రం లక్ష్మీనారాయణ ,మండల అధికార ప్రతినిధి జక్కిసుబ్బారావు, మండల యువజన ట్రెజరర్ నాగరాజు మొదలగువారు పాల్గొన్నారు.

దోమల నివారణకు స్ప్రేయింగ్

పెద్ద దోర్నాల : మండల పరిధిలోని అయినముక్కల, బోడేనాయక్ తండా, సుందరయ్య కాలనీలలో దోమల నివారణ కోసం చేపట్టిన స్ప్రేయింగ్‌ను జిల్లా మలేరియా అధికారి అల్లాడి జ్ఞానశ్రీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల కారణంగా వ్యాప్తి చెందే వ్యాధులు, నివారణా చర్యలు గురించి వివరించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుకరవారం డ్రై డేను పాటించాలన్నారు. దోమ తెరలను వినియోగించాన్నారు. దోమల వల్ల మలేరియా, జ్వరాలు వస్తాయని తెలిపారు. ఎవరికైనా జ్వరం వస్తే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.



బిసి రిజర్వేషన్ కోరుతూ కలెక్టరేట్ వద్ద ఎస్పి నిరసన

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - బాపట్ల

చట్ట సభల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించేందుకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సమాజ వాది పార్టీ జిల్లా అధ్యక్షులు మేధా శ్రీనివాసరావు బీసీ నాయకులుతో కలిసి సోమవారం బాపట్ల డిఆర్ఓ పివి రమణకు స్పందనలో విజ్ఞాపన పత్రం అందజేశారు. సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 1996టిడిపి ప్రభుత్వ హయాంలో, 2008లో కాంగ్రెస్ హయాంలో రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం చేసి చట్టసభల్లో బీసీలకు 33.33శాతం రిజర్వేషన్ కల్పించటానికి అవసరమైన మేరకు రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. బిసి రిజర్వేషన్‌పై స్పష్టమైన హామీ ఇవ్వకపోతే రానున్న ఎన్నికల్లో తమ సత్తా నిరూపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో గొర్ల ఏడుకొండలు, మొర్ల చిన్న వెంకటేశ్వరరావు, కొమ్మనబోయిన వెంకటఫణికుమార్, లంబు సాంబయ్య, నాగూర్, దర్శి చిన భాస్కరరావు పాల్గొన్నారు.



కైతేపల్లి జోష్న పుట్టినరోజు కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ఘనంగా జ్యోత్స్న పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రేస్ ఫౌండేషన్, గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ కైతేపల్లి జోష్నా పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, కొల్లూరు, వేములూరు, అమృతలూరు మండలాల్లో జోష్న పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రేస్ ఫౌండేషన్ ఏపీ ఇన్చార్జి యన్నం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ గ్రేస్ ఫౌండేషన్ కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి ఏదో రూపంలో సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. దీనిలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు, గృహ నిర్మాణాలవంటి సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి సాలెం రాజ్, జ్యోత్స్నా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.



బేటీ బచావో ర్యాలీ నిర్వహిస్తున్న అంగనవాడీ కార్యకర్తలు

'భేటీ బచావో..భేటీ పడావో..'

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భేటీ బచావ్ భేటీ పడావ్ కార్యక్రమాన్ని స్థానిక టీఎం రావు ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భట్టిప్రోలు సెక్టార్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డివి లలిత కుమారి మాట్లాడారు. ఆడపిల్లని చదివిద్దాం- వారిని రక్షిద్దాం అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాలిక ఇంటికి వెలుగు, బాల్య వివాహాలు అరికడదాం, వారిని సమాజంలో ప్రత్యేక గుర్తింపును అందిద్దాం అనే నినాదంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి బాలికలకు పెద్దపీట వేశారని అన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ ధారా రవికిరణ్మయి, అమర్తలూరు సిడిపిఓ విజయలక్ష్మి, నాయకులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులు చూపాలని వినతి

ప్రజాశక్తి కొల్లూరు

వరికోతల సమయంలో యంత్రాలతో కూలీల పొట్ట కొట్టవద్దని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొనిగల సుబ్బారావు, వేములపల్లి వెంకట రామయ్య సోమవారం గ్రీవెన్స్ లో ఎంపీడీఓ ఐ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. అనంతవరం, చిలుమూరు, ఈపూరు, క్రాప తదితర మాగాని ప్రాంతాలైన గ్రామాలలోని ప్రజలు కూలి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని పేద ప్రజలు ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. గతంలో వరి కోతల సీజన్లో రైతుల వద్ద వరి కోతలు, వరుకుప్పల పనులకు అడ్వాన్స్ గా కొంత నగదు తెచ్చుకొని జీవనం సాగించేవారని, ఇప్పుడు యంత్రాలు రావడంతో పనులు లేక వ్యవసాయ కూలీలకు బతుకే భారమవుతుందని వివరించారు. కొంత మంది భవన నిర్మాణ పనులకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కావున వెంటనే ఉపాధి హామీ పథకం కింద పనులను చూపించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య, నాదెండ్ల కోటేశ్వరరావు, గాలి శ్రీను, వనజ పాల్గొన్నారు



ఉపాధి పనులకోసం ఎంపిడిఒకు వినతి

కళాశాలకు నూతన భవనం నిర్మించాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - నిజాంపట్నం

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య అన్నారు. మండలంలోని వివిధ విద్యాసంస్థలను ఆయన సందర్శించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆర్య మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనానికి నోచుకోలేదని అన్నారు. తుఫాన్ షెల్టర్లో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల కారణంగా చుట్టుపక్కల గ్రామాల పేద విద్యార్థులు రేపల్లె, పెట్లవానిపాలెం, కాజీపాలెం ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారని అన్నారు. క్రమంగా కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని అన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్య అవసరమని అన్నారు. అందుకే ఐటిఐ కళాశాలను అభివృద్ధి చేయాలని కోరారు. కళాశాలకు నిధులు ఉన్న స్థలం లేదనే సాకుతో భవనం నిర్మించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఆలోచించి కళాశాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ కార్యదర్శి ప్రేమ్ చంద్, అధ్యక్షులు విజయ్, లక్ష్మయ్య, మురళి, వెంకట గణేష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య

కుందేరులో కట్టడాలు కూల్చేయండి

◆ డిఆర్ఓ పీవి రమణ డ్రైనేజీ అధికారులకు డిఆర్ఓ ఆదేశం ◆ కుందేరులో కట్టడాలపై స్పందనలో డాక్టర్ పాలేటి ఫిర్యాదు

ప్రజాశక్తి - చీరాల

పట్టణానికి ఆనుకుని ఉన్న కుందేరు మురుగునీటి డ్రైనేజీ స్థలాన్ని ఆక్రమించి పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కట్టడాలు నిర్మించడం ద్వారా భవిష్యత్తులో వరద ప్రమాదాలు వచ్చే అవకాశం ఉందని, అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తొలగించాలని, కుందేరును ఆధునీకరించి నీటిపారుదల సౌకర్యం కల్పించాలని కోరుతూ మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, ఇతర ప్రజా సంఘాల నాయకులు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. నీటి వనరుల అవసరాలను తీర్చాల్సిన డ్రైనేజీ శాఖకు చెందిన స్థలంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని, ఈ విషయాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు. నిర్మాణాలు జరుగుతున్న స్థలం, నిర్మాణానికి కేటాయించిన నిధులు, జల వనరుల అవసరాలకు సంబంధించిన స్థలాన్ని ఖాళీ చేయాలని గతంలో కలెక్టర్ సూచించారని వివరించారు. అయినప్పటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయని వెంటనే ఆపకపోతే నిధులు దుర్వినియోగమవుతాయని చెప్పారు. కుందేరు ఆక్రమణ విషయం కోర్టులో కూడా ఉన్నట్లు చెప్పారు. సమస్య విన్న డిఆర్ఓ పీవి రమణ డ్రైనేజీ, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లను పిలిచి వివరాలు అడిగారు. నీటిపారుదల అవసరాలకు కేటాయించిన స్థలంలో జరుగుతున్న నిర్మాణాలను ఈరోజు సాయంత్రం లోపు ప్రొక్లైన్ ద్వారా కూల్చివేయాలని, ఆ నివేదికను తనకు అందజేయాలని డ్రైనేజీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను ఆదేశించారు. అలా చేయకపోతే సస్పెండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. స్పందన కార్యక్రమంలో వినతి పత్రం ఇచ్చిన వారిలో ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి ఏసురత్నం, జనసేన నాయకులు గూడూరు శివరామ ప్రసాద్, చేనేత ఐక్యవేదిక సంఘం నాయకులు శీలం వెంకటేశ్వర్లు ఉన్నారు.



స్పందనలో పిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ పాలేటి

ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం : సిఐ

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఉందని, ఆ సమస్యను అధిగమించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని సిఐ బి రమేష్ బాబు తెలిపారు. తన కార్యాలయంలో విలేకర్లతో సోమవారం మాట్లాడారు. మెయిన్ రోడ్, నామ్ రోడ్, ఎస్బిఐ బ్యాంక్ రోడ్, ఆయిల్ మిల్ రోడ్, బంగ్లా రోడ్లలో వాహన రాకపోకలతో ప్రధాన సమస్యగా ఉందని అన్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యను అదిగమించడానికి ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 9గంటల వరకు ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీసులకు వాహన చోదకులు, వ్యాపారులు సహకారం అందించాలని కోరారు. వ్యాపారులు తమ వ్యాపార నిమిత్తం వచ్చే వాహనాలను పోలీసులు నిర్ణయించిన సమయంలో అన్ లోడ్ ఇన్ లోడ్ చేసుకోవాలని కోరారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలున్న ప్రాంతాల్లో పోలీసు నిఘా ఉందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఆకతాయిలు తిరుగుతూ ద్విచక్రవాహనాల్లో డబుల్, ట్రిబుల్ రైడింగ్ చేస్తూ ఉంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆడపిల్లల జోలికి వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సిఐ బి రమేష్‌బాబు



కాంగ్రెస్ సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం

మోడీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

ప్రజాశక్తి - బాపట్ల

కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్లో సోమవారం జరిగిన కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ చైర్మన్ యార్లగడ్డ గోపి ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం నిరంకుశ పాలనను సాగనంపుదామని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు అహర్నిశలు కృషి చేసి పార్టీని ముందుకు నడపాలని అన్నారు. సుపరిపాలన అందించే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. రాష్ట్రానికి రాజధాని అనేది లేదని, యువతకు ఉద్యోగాలు లేవని, పోలవరం ఇప్పటివరకు పూర్తి కాలేదని అన్నారు. వీటన్నిటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంగ్రెస్ పాలనలోకి తిరిగి రావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బాపట్ల జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు పఠాన్ రాజేష్, ప్రకాష్, తాడికొండ వెంకటేశ్వర్లు, తోట శివానాగేశ్వరరావు, దోనేపూడి దేవరాజు, దండు రేణుక పాల్గొన్నారు.




మజూరీలు పెంచాలని తహశీల్దారుకు చేనేతల వినతి

చేనేత కార్మికుల మజూరీ పెంచాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చేనేత కార్మికులకు వస్త్ర తయారీపై మజూరిని పెంచాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేనేత కార్మిక సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఐక్యవేదిక నాయకులు మురుగుడు సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీ, మద్రివాడ వెంకటరావు మాట్లాడుతూ చేనేత కార్మికులు చాలీ చాలని మజూరీలతో బ్రతుకులు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరి ప్రాంతంలో నూలికి పదిహేను శాతం మజూరి పెంపుదల చేశారని గుర్తు చేశారు. అదే రీతిలో రేపల్లె ప్రాంతంలోని చేనేత కార్మికులకు కూడా ఆయా సంఘాలు మాస్టర్ వీవర్లు మజూరిని పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు దూడిపూడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన తహశీల్దారు హ్యాండ్లూమ్ ఏడీతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను వివరించారు. చేనేత కార్మికులకు మజూరి పెంచే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు దీపాల సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దేశాయిపేటలో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

జగన్‌తోనే సంక్షేమ పాలన

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట-1 సచివాలయం పరిధిలో వైసిపి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కి జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వేటపాలెం ఉప సర్పంచ్ దంతం వెంకటసుబ్బారావు, వైసిపి మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, పులి వెంకటేశ్వర్లు, లేళ్ల శ్రీధర్, సీతామహాలక్ష్మి, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, పృధ్వీ చంద్ర మోహన్, ఖాదర్, దంత హనుమంతు, కర్ల లక్ష్మణరావు, జమ్ము ప్రసాద్ రెడ్డి, పులి శ్రీనివాసరావు, సంగు ప్రభాకర్ రెడ్డి, జంగిలి రామారావు, సాధు రాఘవ, పులి హరికృష్ణ, కాగిత ఆనంద్, పురిమెట్ల వెంకటేశ్వర్లు, పృధ్వీ వెంకటేశ్వర్లు, పిట్టు హనుమంతరావు, కర్ల ప్రసాద్, మధుర రవి, షేక్ హూలీ, కలీల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
మంగళవారం 21 నవంబర్ 2023

స్పందనకు 17 అర్జీలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఎం వెంకటేశ్వరావు నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి 17 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను వెంటనే పరిష్కరించాలని సెక్షన్‌లవారీగా కమిషనర్ బదలాయించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజినీర్ జానీబాషా, అసిస్టెంట్ సిటి ప్లానర్ కె వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారోత్సవాలు

ప్రజాశక్తి-కొండపి

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారోత్సవాలు పురస్కరించుకొని స్థానికంగా ఉన్న నాలుగు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు ముగింపు కార్యక్రమంలో యంఈవోలు కె.సురేఖ, పి.రామారావు చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు గ్రంథాలయ వారోత్సవాల విశిష్టతను వివరించారు. ఆటల పోటీలకు సహకరించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు గ్రంథపాలకుడు ధన్యవాదాలు తెలిపారు. ముగింపు సందర్భంగా 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, టిఎస్ ప్రసాదు, ఆంజనేయులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన'కు దరఖాస్తు చేసుకోవాలి

బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో అర్హులైన చేతివృత్తుల వారు కామన్ సర్వీస్ సెంటర్‌లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వారసత్వ పరంపరను ప్రోత్సహించి సంప్రదాయ పనిముట్లు, చేతులను ఉపయోగించి పనిచేసే కళాకారుల కుటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. వడ్రంగి, స్వర్ణకారులు, శిల్పాలు, విగ్రహాలు, బుట్టలు, మట్టిపాత్రలు, చీపుర్లు తయారు చేసేవారు, దోభి, టైలర్, చేప వలలు తయారు చేసే వారు, చెప్పులు కుట్టేవారు, తాపీ కార్మికులు, క్షురకులు, సంప్రదాయ బొమ్మలు, పూల దండలు, పడవల తయారి దారులు, ఇంటి తాళాలు తయారు చేసేవారు అర్హులని తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంకు పాస్‌పుస్తకం, మొబైల్ నెంబర్‌తో పాటు మొబైల్ తీసుకొచ్చి సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందుగా రూ.లక్ష రుణాన్ని ఐదు శాతం వడ్డీతో ఇస్తారని, 18 నెలల్లో తిరిగి చెల్లించాలని తెలిపారు. రెండో విడతగా రూ.2 లక్షలు రుణం ఇస్తారని 30 నెలల్లో తిరిగి చెల్లించాలని తెలిపారు. దరఖాస్తుదారులు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, గతంలో ఎలాంటి రుణం తీసుకొని ఉండకూడదని చెప్పారు. ఎంపిక మూడు దశల్లో ఉంటుందని, శిక్షణతో పాటు ఉపకార వేతనం ఐదువందల రూపాయాలు చెల్లిస్తారని తెలిపారు. కులవృత్తులవారికి పనిముట్లు కొనుగోలు చేసేందుకు పదిహేను వేల రూపాయాలు ఇస్తారని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అర్హత ఉన్న బీసీ కులాలలకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెగ్యులర్ చేయాలని

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



ఒంగోలులో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమానికి యూనియన్ నగర కార్యదర్శి యు.రత్న కుమారి అధ్యక్షత వహించారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు తమను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికులు గత ఆరుమాసాలుగా రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా పోరాటాలు చేస్తున్నారని వివరించారు. అయినా ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలు, మంత్రులుకు చీమకుట్టినట్లు కూడా అనిపించడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా వైసిపి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర కార్యదర్శి తంగిరాల మహేష్ మాట్లాడుతూ స్థానిక సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని, సమస్యలు పరిష్కారం విషయంలో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్మికులు పిఎఫ్, ఈఎస్ఐ రికార్డులు సక్రమంగా లేవని, వాటిని సరిచేయాలని అనేకమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు, చీపుర్లు, దంతెలు, పుష్‌కాట్లు ఇవ్వాలని అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం విడనాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, నాయకులు టి విజయ, ఎం శ్రీలక్ష్మి, కె బాలకృష్ణ, కొర్నెపాటి రామ్మోహనరావు, రాగే రాములు, సిహెచ్ అక్కేశ్వరరావు, కె పద్మ, కె దివ్య, కె వంశీ, ఆర్ కాశి, తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి కనీసవేతనం ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి పి.ఏడుకొండలు, నాయకులు పి.పద్మ, టి.నరసయ్య, డి.వెంకటేశ్వర్లు, కె.సుబ్బరత్నం, కల్యాణి, ఎలీషా, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 73 ఫిర్యాదులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి చెప్పుకున్నారు. ఎస్పీ వారి సమస్యలు క్షుణంగా విని, ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, భాదితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదేపదే పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదన్నారు. పోలీస్ అధికారులే స్వయంగా బాధితుల వద్దకు వెళ్ళి ఆ ప్రదేశంలో విచారించి సకాలంలో చట్టపరిధిలో పిర్యాదుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చెయ్యాలని ఆదేశించారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలతో 73 మంది ఫిర్యాదుదారులు జిల్లా ఎస్పీకి వారి సమస్యలు విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్‌పి



సమస్యలు తెలుసుకుంటున్న డిఆర్‌ఓ వెంకటరమణ

భూసమస్యల పరిష్కారానికి చర్యలు

డిఆర్‌ఓ వెంకటరమణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భూ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని స్పందన హాల్ లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో భూముల సర్వేకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. సర్వే అధికారులు గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు, గహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్,పంచాయతీ రాజ్ ఎస్.ఇ హరి నారాయణ, గ్రామీణ నీటి సరఫరాల శాఖ ఎస్.ఇ విద్యాసాగర్, పరిశ్రమల శాఖ జి.ఎం మదన్ మోహన్ శెట్టి, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్ , మత్స్య శాఖ జె.డి సురేష్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంత రావు, పౌర సరఫరాల శాఖ డి.ఎస్.ఓ విలియమ్స్ , డి.ఎం శ్రీలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ మురళి

కులగణన సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు

మండల పరిధిలోని కరవది సచివాలయంలో కుల గణన సర్వేపై ఆరు సచివాలయాల సిబ్బంది, వాలం టీర్లకు సోమవారం శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తహశీల్దార్ పి.మురళి, ఎంపిడిఓ అజిత మాట్లాడుతూ సర్వే ఏ విధంగా చేయాలి.. పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇనుప స్తంభాలతో ఇక్కట్లు

ప్రజాశక్తి-కొండపి

కొండపి పట్టణంలో టంగుటూరురోడ్డులో ఉన్న సొసైటీ బ్యాంకు రోడ్డు మొదటిలో ఉన్న ఇనుప స్తంభం, అదేవిధంగా బంగారు కొట్టు ముందు ఉన్న ఇసుప స్తంభాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలంలో స్తంబాలు తడిసి.. షాక్ వస్తుందంటున్నారు. ఏఈ కుంచాల కోటయ్యను వివరణ కోరగా ఇసుప స్తంభాల వల్ల ఎటువంటి ఇబ్బందులూ లేవని, ఇబ్బందులు కలిగితే తొలగిస్తామని చెప్పారు.



పైప్‌లైన్‌ను ప్రారంభిస్తున్న బాలినేని

తాగునీటి పైప్‌లైన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక 18వ డివిజన్ ప్రాంతంలోని వెంగముక్కపాలెం, సురక్ష లే అవుట్‌లకు పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన నూతన తాగునీటి పైప్‌లైన్‌ను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్ష లే అవుట్, అపార్ట్‌మెంట్ ప్రజలతో పాటు వెంగముక్కపాలెంలోని కొన్ని ప్రాంతాల ప్రజలు పైప్‌లైద్వారా తాగునీటి సరఫరా లేక గత అనేక సంవత్సరాలుగా ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమీపంలోని మదర్ థెరిస్సా కాలనీ వద్ద ఉన్న పైప్‌లైన్ నుంచి సురక్ష అపార్ట్‌మెంట్, మామిడిపాలెం సమీపంలోని కొన్ని ప్రాంతాలకు నూతనంగా తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పైప్‌లైన్ ఏర్పాటు ద్వారా ఇక మీదట ఆయా ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, నగరపాలక సంస్థ ఇంజినీర్ జానీబాషా, డిఈఈ పద్మజా, సురక్ష అపార్ట్‌మెంట్ నివాసితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘుపతి

17న గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

బాపట్ల ఎమ్మెల్యే రఘుపతి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా కేంద్రం బాపట్ల పట్టణంలో డిసెంబర్ 17న కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు బాపట్ల శాసనసభ్యులు మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి తెలియజేశారు. సోమవారం కోన ఛాంబర్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 17వ తేదీన ఏబీయం గ్రౌండ్స్‌లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడానికి నిశ్చయించామని ఈ వేడుకలకు ప్రపంచ ప్రఖ్యాత సువార్తికులు డాక్టర్ పాల్ దినకరన్ ముఖ్య అతిథులుగా వస్తున్నారన్నారు. గత 20 సంవత్సరాల కాలంలో విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఆయన సువార్త సభలకు వచ్చింది లేదన్నారు. మూడు సంవత్సరాల నుంచి ఆయన కోసం ప్రయత్నాలు చేస్తూ ఉండగా బాపట్ల నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత ఈ సంవత్సరానికి ఆయన తీసుకురావడానికి వీలు కలిగిందన్నారు. 17వ తేదీన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించిన అనంతరం 18వ తేదీన సేవకుల కూడికతో పాటు ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. కులాలు మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఈ గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. గత కొన్ని సంవత్సరాల నుంచి బాపట్ల నియోజకవర్గంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు జరపటం అనే ఒక ఆనవాయితీని శాసనసభ్యులు కోన రఘుపతి మొదలుపెట్టారని, దానినే ఇప్పుడు అందరూ నాయకులు ఫాలో అవుతున్నారని పట్టణ వైసీపీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాఘవరెడ్డి, వైసీపీ నాయకులు డేవిడ్, మణిభూషణ్, మాల్యాద్రి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిని కష్ణమూర్తి పాల్గొన్నారు.



నష్టపోయిన వైట్‌బర్లీ పంటను చూపుతున్న కౌలురైతు

నష్టపోయిన వైట్‌బర్లీ రైతు

ప్రజాశక్తి - పర్చూరు

ఇటీవల కురిసిన వర్షాలతో వైట్‌బర్లీ పొగాకు ఉరకెత్తి మొక్కలన్నీ కుళ్లిపోయాయి. దీంతో తిరిగి నాట్లు వేయాల్సి వచ్చింది. బోడవాడ, పర్చూరు గ్రామాల్లో వైట్‌బర్లీ సాగు వర్షాలు లేని కారణంగా డ్రమ్ములతో నీళ్ల తెచ్చుకుని నాటిన మొక్కలు అకాల వర్షంతో నష్టపోయారు. మండలంలోని బోడవాడ గ్రామానికి చెందిన కొరిశపాటి ఇజ్రాయేలు ఐదు ఎకరాల్లో వైట్ బర్లీ సాగు చేశాడు. ఎకరాకు రూ.36వేల చొప్పున ఐదు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. నారుకూలి, దున్నటం, ఇతర ఖర్చులు ఎకరాకు రూ.10వేలు, ఎకరాకు రూ.5వేల చొప్పున నారు కొనుగోలు చేశారు. నాటు కూలీ ఎకరాకు రూ.3వేలు ఖర్చుపెట్టారు. ఎకరాకు బలం మందు రూ.5వేలు ఖర్చు చేశారు. వారం క్రితం కురిసిన అకాల వర్షానికి పొలంలో నీళ్లు నిలిచి వేసిన ఐదెకరాల్లోని పంట మూడెకరాల్లో దెబ్బతినింది. మళ్లీ నారు కొని రెండో సారి దెబ్బతిన్న మూడెకరాలు నాట్లు వేస్తున్నారు. చినబోడవాడకు చెందిన ఆకుల వెంకటేశ్వరరావు అనే రైతు రెండు ఎకరాలలో వైట్ బర్లీ సాగు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంట మొత్తం ఉరకెత్త పాడైంది. ఎకరాకు రూ.5వేల చొప్పున నారు కొనుగోలు చేశాడు. ఇంత నష్టం జరుగుతున్నా ఆశ చావక సాగుపై ఆధారపడుతున్నారు.




సభలో మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జి కృష్ణచైతన్య

సొసైటీ అభివృద్ధికి సహకరిస్తా..

ప్రజాశక్తి – మెదరమెట్ల

సొసైటీ అభివృద్ధికి సహకారం అందిస్తానని శాప్ నెట్ చైర్మన్, వైసిపి ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని రావినూతల గ్రామంలో పిఎసిఎస్ పరిధిలో 70అఖిల భారత సహకార వారోత్సవాలలో ఆయన మాట్లాడారు. రావినూతల సహకార పరపతి సంఘం అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు. తన తండ్రికి కూడా ఇష్టమైన గ్రామమని చెప్పారు. సొసైటీ అభివృద్ధిలో కారుసాల సింగయ్య పాత్ర గురించి వివరించారు. సొసైటీ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు అడిగిన విధంగా ఇక్కడ గోడౌన్ నిర్మాణానికి, ఒక ఏటీఎం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ముందుగా సొసైటీ అధ్యక్షులు మాట్లాడుతూ ఈ సంవత్సరం రూ.62లక్షల నికర ఆదాయాన్ని పొందినట్లు ప్రకటించారు. రూ.కోటి80లక్షల డిపాజిట్లతో ముందుకు సాగుతున్నామని అన్నారు. సమావేశానికి కంచర్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డిసిఏఓ ఎలమందరావు, పిడిసిసి బ్యాంక్ అధ్యక్షులు వరప్రసాదరెడ్డి, డిసిఓ కెవి రామారావు, పిడిసిసి సిఈఓ ప్రకాష్, ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, రావి శ్రీధర్ పాల్గొన్నారు.



ఎంఎల్ఎ ఏలూరిని సత్కరిస్తున్న టిడిపి క్రిస్టియన్ సెల్ నేతలు

టిడిపి అభివృద్ధికి పనిచేయాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టిడిపి అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. మార్టూరుకు చెందిన తుమ్మల వెంకట్రావ్ క్రిస్టియన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా టిడిపి నాయకులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏలూరిని సన్మానించారు. చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ రావడం హర్షణీయం అన్నారు.

బాల్యం నుండే పోటీతత్వం అలవర్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నజీర్‌అహ్మద్

ప్రజాశక్తి - బాపట్ల

స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుండి సామాజిక చైతన్యానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడ్డాయని స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ నజీర్ అహ్మద్ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బి శరత్ బోస్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు బాల్యం నుంచే గ్రంథాలయాల్లో నిక్షిప్తమైన విజ్ఞానంతో పాటు మహానుభావుల జీవిత చరిత్ర, సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలను చదువుకొని విజ్ఞానాన్ని పొందాలని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు అంగలకు దురు శివాజీ గణేషన్, బాపట్ల పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ వెలగా శ్రీనివాస రఘురాం, ఎవివి హై స్కూల్ ఉపాధ్యాయి ని సత్యవతి, ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయి బాబు, వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జున్, నరసింహారావు పాల్గొన్నారు.

కర్లపాలెం : బాల్యం నుండే పోటీతత్వం అలవర్చుకోవాలని, అప్పుడే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకుంటాడని ఎంపీటీసీ కంకిపాటి హైమావతి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. పంచాయతీ సెక్రెటరీ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుండే గ్రంథాలయలకు వచ్చి మంచి పుస్తకాలు చదివి ఉన్నత భవిష్యత్ సాధించాలని అన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు కేర్ స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి టీవీ రమణమ్మ, హైస్కూల్ ఉపాధ్యాయులు ఎన్ విజయసారధి, పిఈటి సుబ్బారెడ్డి, ఎస్ ఉదయ్ కుమార్, ఇందుమతి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఉపాధ్యాయులు

బల్లికురవ : స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం జరిగాయి. లైబ్రేరియన్ ఎ రమేష్ ఆధ్వర్యంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు నటరాజ, గంగవరపు సునీత విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో గంగవరపు సునీత, ఎ రమేష్, రమాదేవిలను పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు.

భట్టిప్రోలు : స్థానిక మాటూరు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సభ సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్పంచి ధారా రవికిరణ్మయి చేతుల మీదగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, లైబ్రేరియన్ కలపాల సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

నిజాంపట్నం : విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని స్తానిక శాఖ గ్రంథాలయ అధికారిణి ఎన్ విజయలక్ష్మి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ కె గౌరీశంకర్, గ్రంథాలయ కమిటీ మెంబర్స్ షేక్ తాజుద్దీన్, కె లక్ష్మీనరసింహారావు, కొల్లిపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎఎంసి ఛైర్మన్ ఉప్పు శిరీష

కొల్లూరు : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వేమూరు ఎఎంసి చైర్మన్ ఉప్పు శిరీష, కొల్లూరు మండల వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్ రమావత్ విజయ భాయ్, వైసిపి సీనియర్ నాయకులు సాంబయ్య, సాయి వాసవి విద్యాసంస్థల డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు మాట్లాడారు. గ్రంథాలయ అధికారి వై రాంబాబు మాట్లాడుతూ శివరామకృష్ణను ఆదర్శంగా విద్యార్థినీ, విద్యార్థులు తీసుకోవాలని అన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మండలంలోని అనంతవరంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఎ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి టి మణిరాజు, జి విజయ, ఎం నిర్మల, గ్రంథాలయ అధికారి జి కనకదుర్గ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రేపల్లె : గ్రంథాలయాలతోనే సంపూర్ణ విజ్ఞానం లభిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ జి ప్రశాంత్ కుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14నుండి జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా గ్రంథాలయాల ఆవశ్యకతను తగ్గించలేక పోయాయని అన్నారు. పాఠశాలల విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇంచార్జీ కె స్వాధిక్ కుమార్, డి బసవలక్ష్మి పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న తహశీల్దారు సుబ్బారెడ్డి

అద్దంకి : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహశీల్దారు జిబి సుబ్బారెడ్డి మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రవీంద్ర భారతి ఎయిటెడ్ స్కూల్, భాష హై స్కూల్ విద్యార్థులు, అద్దంకి గర్ల్స్ హై స్కూల్, ప్రకాశం బాయ్స్ హై స్కూల్, చక్రాయపాలెం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు, అద్దంకి నగర అభివృద్ధి కమిటీ చైర్మన్ త్రిమూర్తులు, మంద జోసెఫ్, పతంగి దుర్గేష్, సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ అయినా రాజు, సంధి రెడ్డి శ్రీనివాసరావు, గ్రంధపాలకుడు సుగుణరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న పిఎసిఎస్ ఛైర్మన్ కాంతారావు

నగరం : మండలంలోని మంత్రిపాలెం గ్రామంలో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పీఏసీఎస్ చైర్మన్ ఆర్ కాంతారావు, సర్పంచ్ ఎం ప్రమీలాదేవి, సేంద్రియ వ్యవసాయదారుడు ఎం రాధాకృష్ణమూర్తి మాట్లాడారు. గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ అధికారి జొన్న బ్రహ్మేంద్ర గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. వారం రోజులపాటు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, ఆటలు, తదితర పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కారంచేడు : స్థానిక శాఖా గ్రంథాలయం వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు సోమవారం పంపిణీ చేశారు. ఎంఈఓ ఎంవి సత్యనారాయణ, ఎం వెంకటేశ్వర్లు, గ్రంథ పాలకులు ఎం నాగయ్య మాట్లాడారు. ఈనెల14 నుండి 20 వరకు జరిగిన వివిధ కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవాలని సూచించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

కులగణనలో నిబంధనలు పాటించాలి



కులగణనపై సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి కె దేవరాజ్

ప్రజాశక్తి - అమర్తలూరు (చెరుకుపల్లి)

ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా కుల గణన సర్వే సమగ్రంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి కె దేవరాజ్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుల గణన సర్వే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. ప్రత్యేక అధికారి దేవరాజ్ సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఈకెవైసీ ద్వారా వాలంటీర్, సచివాలయ సిబ్బంది కులగనన నిర్వహించాలని చెప్పారు. మొదటి రోజు అమర్తలూరు1, అమర్తలూరు2, గోవాడ, ఏడఊరు, పాంచాలవరం గ్రామాల సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణ నిర్వహించారు.

భట్టిప్రోలు : ప్రభుత్వం చేపట్టనున్న కులగణన సర్వేపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రేపల్లె ఆర్డీఓ హెలా షారోన్ సూచించారు. మండలంలోని వెల్లటూరు పంచాయతీ కార్యాలయం వద్ద వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ఒకరోజు శిక్షణ సోమవారం నిర్వహించారు. తహశీల్దారు దూళిపూడి వెంకటేశ్వర ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఆర్డీఓ మాట్లాడుతూ కులగణన సమగ్రంగా చేపట్టాలని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కులాల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రామ్ కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిజాంపట్నం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై సోమవారం శిక్షణ ఏర్పాటు చేశారు. శిక్షణలో ఎంపీడీఓ ఎన్ నాగలక్ష్మి, తహశీల్దార్ నెహ్రూ బాబు వివిధ సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించే కులగణన ప్రారంభంకానున్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను పక్కగా పాటించాలని చెప్పారు. ప్రతి కుటుంబానికి సర్వే పూర్తి చేసిన తర్వాత సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్, ఫేషియల్ లేదా ఐరిస్ వేయాలని, వాలంటీర్లు అయితే ఈకేవైసి వేసి వివరాలను సబ్మిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ నాజర్ ఖాన్ పాల్గొన్నారు.



కులగణనపై శిక్షణలో మాట్లాడుతున్న రేపల్లె ఆర్‌డిఓ షారోన్



కులగణనపై శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఓ నాగలక్ష్మి

తెలుగుదేశం శ్రేణుల సంబరాలు


ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఆనందం వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి - పంగులూరు

స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబుకు హైకోర్టు సాధారణ బెయిల్ మంజూరు చేయడంతో టిడిపి శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ళలో టపాసులు కాలుస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. టిడిపి సీనియర్ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు మాట్లాడుతూ అన్యాయంగా నిరాధారాలతో కేవలం కక్షపూరితంగా చంద్రబాబును అరెస్ట్ చేశారని అన్నారు. ఇదే ఉత్సాహంతో టిడిపి గెలుపుకు కార్యకర్తలు పనిచేయాలని కోరారు. చంద్రబాబుకు బెయిలు రావడం పట్ల టిడిపి మండల అధ్యక్షులు రావురి రమేష్ బాబు, అధికార ప్రతినిధి గుర్రం ఆదిశేకర్, నాయకులు బోప్పూడి నాగేశ్వరరావు, రామకూరు పంచాయతీ ఉప సర్పంచ్ పెడవల్లి అశోక్, మానం రమేష్, నార్నే శ్రీకాంత్, శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, బైటమం జులూరు మాజీ సర్పంచ్ శివరాజు, మాజీ ఎంపీటీసీ అచ్చిరాజు, రేణింగవరం మాజీ సర్పంచ్ అమర్తపూడి ఏసోబు, షేక్ మస్తాన్ వలి, కోమటి ప్రసాద్, ఎర్రమనేని శివాజీ, పచ్చవ శ్రీనివాసరావు, గొల్లపూడి శేషగిరి, పెంట్యాల రామలింగస్వామి, దశరథ, గొట్టిపాటి ఖాజా స్వామి, ఆదిరెడ్డి, బాచిన త్రివేణి బాబు, కాటా అంజయ్య, జాగర్లమూడివారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో జాగర్లమూడి పూర్ణచంద్రరావు, జాగర్లమూడి కోటేశ్వరరావు, ఉప్పుటూరి హనుమంతరావు, కేతినేని మల్లేశ్వరరావు, జాగర్లమూడి ప్రసాదరావు, జాగర్లమూడి చిరంజీవి, ధూళిపాల స్వాములు, దూళిపాల పార్వతి, గడ్డం కృష్ణమూర్తి, గడ్డం సాయి కృష్ణ, వీరమాచి ఆదినారాయణ, అంజయ్య, జాగర్లమూడి విజయ్, గడ్డం తులసమ్మ, ధూళిపాల సుబ్బారావు, ధూళిపాల రాముడు, జరుగుల స్వాతి, జరుగుల సుబ్బారావు, చెరుకూరి సుబ్బారావు, గొట్టిపాటి రంగనాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్‌పై హర్షం

ప్రజాశక్తి - బాపట్ల


టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ

స్కిల్ స్కాం కేసులో హైకోర్టు చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడంపై టిడిపి ఇన్చార్జి వేగేశన నరేంద్ర వర్మ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపుతోనే చంద్రబాబుపై కేసులు పెట్టిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికలకు సిద్ధం కానున్నారని తెలిపారు.

కర్లపాలెం : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు నక్కల వెంకటస్వామి అన్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో టిడిపి, జనసేన ఉమ్మడిగా బాబు షురిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ, తెలుగు మహిళ మండల అధ్యక్షులు ఇనగంటి సునీత, అయ్యప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై టిడిపి, జనసేన ఉమ్మడి నిరసన


రోడ్ల దుస్థితిపై వేటపాలెంలో టిడిపి, జనసేన నిరసన

ప్రజాశక్తి - వేటపాలెం

గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది జగన్ అంటూ రోడ్ల దుస్థితిపై టిడిపి జనసేన ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గుంతల వలన ప్రమాదాలు జరిగుతున్నాయని అన్నారు. మరణాలు సంభవిస్తున్న ప్రభుత్వానికి ఉలుకు పలుకులేకుండా ఉందని అన్నారు. వేటపాలెం బైపాస్, పాత బైపాస్ రోడ్డులో గుంతల మయంగా ఉన్న రోడ్డు వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి ఇంచార్జ్ ఎంఎం కొండయ్య, జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆమంచి శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాసిక వీరభద్రయ్య, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ యాసిన్, కర్ణ కిరణ్ తేజ, పసుపులేటి సాయి, వాయిల శ్రీను, బత్తిన బాలాజీ, సంజయ్, మలిశెట్టి ప్రతాప విజయ్, పేరిశెట్ల బాలచంద్ర, ఉమ్మిటి శివశంకర్, గంజి పురుషోత్తం, మోహన్ హరికృష్ణ, కౌత్రపు జనార్ధనరావు, కావూరి సుబ్బయ్య, సజ్జా సూర్య బాలానందం, ఉసురుపాటి సురేష్, వెంగళ భరత్, దగ్గుబాటి వెంకటరావు, పలకల మస్తానరావు, కుంచాల రామాంజనేయులు, పఠాన్ ఆయుబ్, సోమిశెట్టి కిరణ్, శాఖమూరి సాయి చరణ్, మాతరాజు రాకేష్, కొండూరు సుధీర్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : టిడిపి మేనిఫెస్టో, బాబు షురిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికి తిరిగి విస్తృత పంచారు. మండలంలోని ఐలవరం, భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో టిడిపి నాయకులు, భూత్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇన్చార్జులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రకారం టిడిపి అధికారం చేపట్టగానే పూర్తిస్థాయిలో అమలుచేసి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. వైసిపి పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయం, అరాచకాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి కొరకు టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాచర్ల నాగరాజు, దీపాల శివప్రసాద్, వామనపల్లి కోటేశ్వరరావు, అనగాని ఏడుకొండలు, తాత వీరాంజనేయులు, మద్దాల రమేష్, జగ్గారపు పాపారావు, ఎడ్ల జయశీలరావు, కంభం సుధీర్ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని యనమదల బస్సు స్టాండ్ సెంటర్ నందు సోమవారం టిడిపి, జనసేన ఆధ్వర్యంలో రోడ్ల దుస్థితిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు రావిపాటి సీతయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసిందని విమర్శించారు. రోడ్ల పరిస్థితి మరీ అద్వానంగా ఉందని అన్నారు. మోకాళ్ళ లోతు గుంటలు పడి ప్రాయాణికులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. కనీసం గుంటలను ఎర్రి మట్టితోనైనా పూడపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెండు పార్టీల నాయకులు నాగేశ్వరరావు, సుబ్బారామయ్య, అయ్యప్ప, సాంబశివరావు పాల్గొన్నారు.


యద్దనపూడిలో రోడ్ల దుస్థితిపై టిడిపి, జనసేన నిరసన

సహకార రంగంతో వ్యవసాయాభివృద్ధి

ప్రజాశక్తి - పంగులూరు


సమావేశంలో వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య

సహకార సంఘాల ద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని వైసిపి ఇన్చార్జ్, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. అఖిలభారత 70వ సహకార వారోత్సవాలు మండలంలోని బూదవాడ సొసైటీలో సోమవారం నిర్వహించారు. రావినూతల, పుల్లలచెరువు సొసైటీలు జిల్లాలో నెంబర్ వన్ స్థానాన్ని పొందాయని అన్నారు. సహకార సంఘాలు రైతులకు అవసరమైన అన్ని రకాల సూచనలు, సలహాలతో పాటు రుణాలు కూడా అందించాలని అన్నారు. బూదవాడ సొసైటీ కూడా ఆ విధంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రధమ స్థానానికి చేరుకునే విధంగా ప్రస్తుత అధ్యక్షులు పులికండం అంజిరెడ్డి కృషి చేయాలని కోరారు. రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేస్తూ వాటిని సకాలంలో రికవరీ చేసుకోవాలని అన్నారు. పంట అదును సమయంలో రైతులకు రుణాలు ఇస్తే వాటిని సక్రమంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఆలస్యమైతే రుణాలు ఇచ్చి కూడా ఉపయోగం ఉండదని అన్నారు. అనంతరం కృష్ణ చైతన్యను, సహకార అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బూదవాడ సొసైటీ అధ్యక్షులు పులిఖండం అంజిరెడ్డి, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, మండల ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఇంకొల్లు పిడిసిసి బ్యాంక్ మేనేజర్ ఎం చెన్నారెడ్డి, జిల్లా సహకార అధికారి కెవి రామారావు, అద్దంకి కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ కోటి వీరయ్య, పంగులూరు కో-ఆపరేటివ్ ఇంచార్జ్ నాగేశ్వరరావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి కె ఎలమందరావు, అద్దంకి సబ్ డివిజన్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీదేవి, బూదవాడ సిఇఒ అంజయ్య, చందలూరు సిఇఒ శ్రీనివాసరావు, ఇతర సొసైటీల సీఈఒలు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం

ప్రజాశక్తి - రేపల్లె


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కట్టా మంగ

సిఎం జగన్ మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందరిని ఆదుకుంటున్నారని మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ పేర్కొన్నారు. పట్టణంలోని 4, 5వార్డులో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో 99.5 శాతం హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీల అమలు పూచీ తనదంటూ 2014లో నమ్మబలికిన పవన్ కళ్యాణ్ అనంతరం దగా చేశాడని అన్నారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు, పవన్ ఉమ్మడి మేనిఫెస్టోతో వస్తున్నారని, వారికి తగినరీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. సుపరిపాలన కొనసాగాలంటే సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, విశ్వనాథ గుప్తా, పట్టణ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని ఆదిపూడి పంచాయతీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఒ పి లక్ష్మీనారాయణ, పిఒపిఆర్డి ఆర్ రమేష్ బాబు, పంచాయతీ సర్పంచి నాగరాజు, కార్యదర్శి కృష్ణ, వైసీపీ నాయకులు దండా చౌదరి పాల్గొన్నారు.

'ఓపెన్ స్కూల్'కు 26 వరకు గడువు

ప్రజాశక్తి - బాపట్ల


డిఇఒ రామారావు

ఓపెన్ స్కూలు 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో దరఖాస్తు చేసుకునేందుకు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 26లోగా చెల్లించుకోవాలని డిఇఒ పివిజె రామారావు సోమవారం తెలిపారు. అర్హత గల అభ్యర్థులు దగ్గర్లోని ఎ1 సెంటర్లుకు వెళ్ళి ఒరిజినల్ సర్టిఫికెట్లు అందజేసి ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలన్నారు. 10వ తరగతిలో ప్రవేశానికి 2023జూన్ 31 నాటికి 14ఏళ్ళు వయసు ఉండాలని తెలిపారు. అడ్మిషన్లకు రికార్డ్ షీటు గాని టిసితో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ తండ్రిలేక తల్లి ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రాలు జత చేయాలని తెలిపారు. ఎటువంటి విద్యార్హత లేకున్నా జనన ధ్రువీకరణ పత్రంతో పాటు స్వీయ ధ్రువీకరణతో నేరుగా అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. ఇంటర్‌లో ప్రవేశానికి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్‌తో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ తండ్రి తల్లి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు పొందుపరచాలని తెలిపారు.


కెఆర్‌కె డిగ్రీ కాలేజీలో నాక్ బృందం పరిశీలన

నాక్ బృందం పరిశీలన

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ కేఆర్‌కె డిగ్రీ కళాశాల నాక్ గ్రేడ్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి మోహన్‌రావు సోమవారం తెలిపారు. కళాశాల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి గ్రేడ్ నిర్ణయించేందుకు ఈ నెల 17, 18తేదీల్లో నాక్ బృందం కళాశాలను సందర్శించినట్లు తెలిపారు. ఈ బృందంకు ప్రొఫసర్ హనుమారెడ్డి అధ్యక్షత వహించగా అనిల్ కుమార్ మహాపాత్ర, మనోజ్ కుమార్ పాల్ సభ్యులుగా కళాశాలకు నాక్ ప్రమాణాల ఆధారంగా కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి, రికార్డులను నిశితంగా పటిలించినట్లు తెలిపారు. ఈ నాక్ గ్రేడ్ పొందడంలో కీలకంగా వ్యవహరించిన ఐ క్యూ ఏసి కో ఆర్డినేటర్ డాక్టర్ దాస్‌కు అభినందనలు తెలిపారు.


గిరిజన సమస్యలపై టిడిపి గిరిజన విభాగం ఆందోళన

గిరిజన సమస్యలపై ఆందోళన

ప్రజాశక్తి - బాపట్ల

గిరిజనుల అభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని టిడిపి బాపట్ల పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను ఆరోపించారు. టిడిపి గిరిజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్పందనలో డిఆర్ఓ పివి రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుమలశెట్టి శ్రీను మాట్లాడుతూ వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర పేరిట తిరుగుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను మోసం చేస్తున్నారని అన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.5355వేలకోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చిన రూ.8000వేలకోట్లు మింగేసిందని అన్నారు. కార్యక్రమంలో ఇండ్ల శ్రీనివాసరావు, కోమరగిరి నాగేశ్వరరావు, గున్నం ఆంకమ్మరావు, బాకుల మురళి, మహిమరాజు, బొజ్జా రామ మోహనరావు , శ్రీకాంత్, సుబ్బారావు, మెలికా తిరుమల, వీరయ్య, సీమోను పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిగా ఉన్న స్థలాన్ని

గిరిజనుల శ్మశానానికే కేటాయించాలి

తహశీల్దార్‌కు కెవిపిఎస్, వ్యకాస నేతల వినతి



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న కెవిపిఎస్, వ్యకాస నేతలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డినగర్, మల్లికార్జున నగర్, పోతుల చెంచయ్య కాలనీకి సంబంధించిన గిరిజనుడిపై దాడి, శ్మశానం ఆక్రమించిన విషయంపై కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం శింగరాయకొండ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సిహెచ్.ఉషాతో సోమవారం మాట్లాడారు. నేతలు మాట్లాడుతూ సర్వే నెంబర్ 105/2లో నాలుగు ఎకరాల ముప్పై మూడు సెంట్లు భూమిని 700 కుటుంబాలు చనిపోతే శ్మశానం కోసం రెవెన్యూ అధికారులు గతంలోనే కేటాయించారని చెప్పారు. ఈ స్థలం ఏ విధంగా అయినా కాజేయాలని చూసిన వైసిపి నాయకుడిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. చాన్‌బాషాపై అట్రాసిటీ కేసు ఉన్నప్పటికీ నేటికీ పోలీసులు అరెస్టు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గిరిజనుల శ్మశాన భూమిపై కన్నేసిన వైసిపి నాయకుడు వరుసగా ఆ భూమి నాదేనంటూ గిరిజనులపై దాడులకు పాల్పడుతున్నాడంటే దీని వెనుక ఎవరి హస్తం ఉందో వెలికి తీయాలని కోరారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ భూమి కోట్ల రూపాయలు విలువ చేయడంతో ఆ భూమిని చేజిక్కించుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారని అధికారులు ఈ విషయంలో పేదలకు అండగా ఉండాలని కోరారు. లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యచరణ ద్వారా ఈ స్థలాన్ని సాధించుకుంటామని తెలియజేశారు. తహశీల్దార్‌ని కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేశపోగు మోజేష్, జిల్లా కమిటీ సభ్యుడు పెముల బాబురావు ఉన్నారు.

27, 28 తేదీల్లో

మహాపడవ్‌కు తరలిరావాలి

సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు



మాట్లాడుతున్న చుండూరి రంగారావు

ప్రజాశక్తి-కొండపి

కార్మిక, కర్షక, కష్టజీవుల హక్కులను నిర్వీర్యం చేస్తూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటిస్తూ దేశ వ్యాప్తంగా నవంబర్ 27, 28 తేదీల్లో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. సోమవారం కొండపి పరిసర ప్రాంతాల్లో పొలాల్లో పనిచేస్తున్న రైతులు, రైతు కూలీలను కలిసి సంయుక్త కిసాన్ మోర్చా బృందం కరపత్రాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబేట్టే చట్టాలు తెచ్చిందని, ఆ చట్టాలను రద్దు చేయాలని కార్మికులు, కష్టజీవుల అండతో రైతాంగం ఢిల్లీ నడిబొడ్డున ఏడాదిన్నర పాటు మహోన్నత ఉద్యమాన్ని సాగించారని తెలిపారు. ఆ ఉద్యమంలో 775 మంది పైగా ప్రాణాలర్పించారని, ఎండకు ఎండి, వానకు తడిసి , చలికి వణుకుతూ కూడా వ్యవసాయ రంగాన్ని కాపాడుకునే లక్ష్యంతో ఆ ఉద్యమం సాగిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఆ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేశారని చెప్పారు. ఆ పరిస్థితుల్లోనే మోడీ తాను తెచ్చిన చట్టాలు రద్దు చేసుకుంటున్నట్లు, ఉద్యమకారులకు క్షమాపణలు చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. చెప్పిన మాటలు విస్మరించి అవే చట్టాలను అమలు చేస్తున్నారని, రైతాంగ ఉద్యమానికి ఇచ్చిన హామీలన్ని మోడీ తుంగలో తొక్కారని అన్నారు. విజయవాడ జింఖాన్ గ్రౌండ్‌లో జరిగే మహా ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు కూలీ సంఘాల జిల్లా కార్యదర్శులు పమిడి వెంకట్రావు, కంకణాల ఆంజనేయులు, ఎన్.నాగరాజు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో కరువు తీవ్రంగా ఉన్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సిగ్గు చేటని అన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 39 మండలాల్లో ఐదు లక్షల ఎకరాలకు పైగా సాగు కావాల్సి ఉండగా రెండున్నర లక్షల సాగు అయిందని అందులో సగానికి పైగా వర్షాలు లేక ఎండిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామీణ పేదలకు ఆదుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరువు పర్యటనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ల కబంధహస్తాల నుండి వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు కార్మిక కర్షక, కష్టజీవులంతా సమైక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అందులో బాగంగా నవంబర్ 27, 28 తేదీలలో విజయవాడలో జరిగే మహా పడవ్‌కు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటి సభ్యులు కేజి మస్తాన్, రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.వి కృష్ణారావు, రైతు సంఘం నాయకులు గుమ్మళ్ల వెంకటేశ్వర్లు, మహిళా సంఘం నాయకురాలు ఎస్.భారతి, వివిధ సంఘాల నాయకులు మల్లెల పెద్దపేతురు, అంగలకుర్తి కోటేసు, జయరావు, సుబ్బారావు, ఏ మాధవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు అర్జీ ఇస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు

ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై

కఠినచర్యలు చేపట్టాలి

ఆర్డీవోకు ప్రజాసంఘాల ఐక్యవేదిక వినతి

ప్రజాశక్తి-కనిగిరి

ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాధితులు కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్‌ను సోమవారం గ్రీవెన్స్‌డేలో కలిసి వినతిపత్రం అందజేశారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో 894'895 సర్వే నెంబర్‌లోనే వాగు పోరంబోకు భూమిని, అసైన్మెంట్ భూమిని బలసాని రూబెన్ కోటేశ్వరరావు, బెంజిమెన్లు ఆక్రమించుకొని విక్రయాలు చేపట్టారన్నారు. అదేవిధంగా 894 సర్వే నెంబర్లు 8.04 భూమిని సగం చేసి ప్రైవేట్ లేఔట్ ద్వారా విక్రయాలు జరిపారన్నారు. శ్రీరంగాపురంలో సర్వేనెంబర్ 268లో అన్యబోయిన బాల గురయ్యా, శ్రీనివాసులు 2.43 సెంట్లు భూమిని ఆక్రమించే నిర్మాణాలు చేపట్టారని, పోలీసు శాఖకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాంగనగర్లో సర్వేనెంబర్ 1009లో కాసింది ఇంటికి పడమట వైపున షేక్ మౌలాలి ప్రభుత్వ భూమిని ఆక్రమించి రోడ్డు లేకుండా చేశారని, పై సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆర్డీవోనీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పీసీ కేశవరావు కోరారు. గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి పేదలకు న్యాయం జరిగేలా పేదలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరించకపోతే పోరాటం ఉధతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే బషీరా, నరేంద్ర, ఏడుకొండలు పాల్గొన్నారు.

సామాజిక సాధికార

బస్సు యాత్రను జయప్రదం చేయండి

- ఒంగోలు భూ ఆక్రమణల వ్యవహారంలో 200 మంది పరారీలో ఉన్నారు
- తప్పుచేసిన వారందరినీ ఎప్పటికైనా లోపల వేసి తీరుతాం..
- రానున్న రోజుల్లో ఇద్దరిని మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని



మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఈ నెల 22న ఒంగోలులో వైసిపి ఆధ్వర్యంలో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సుయాత్రలో మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, విడదల రజని, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, హఫీజ్ ఖాన్, తదితరులు పాల్గొంటారని తెలిపారు. 22వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. తరువాత బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ సెంటర్‌లో సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. నాలుగున్నరేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే బస్సుయాత్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఆయా వర్గాల కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి శకటాలను కూడా ప్రదర్శనలో ఉంచుతామని తెలిపారు. 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు.

200 మంది పరారీలో ఉన్నారు..

ఒంగోలులో భూ ఆక్రమణలు, నకిలీ స్టాంపులు, కబ్జాల వ్యవహారంలో 200 మంది పరారీలో ఉన్నారని, వందలాది కేసులు నమోదై ఉన్నాయని, వారందరినీ వదిలే ప్రసక్తే లేదని బాలినేని హెచ్చరించారు. ఈ కేసులో ఇప్పటికే అనేకమందిని లోపల వేయడం జరిగిందని, పరారీలో ఉన్నవారిని కూడా పట్టుకొని వారిలో ఎవరైనా దోషులు ఉంటే వారిమీద ఖచ్చితంగా కేసులు నమోదు చేసి జైల్లో పెట్టడం జరుగుతుందన్నారు. మండువవారిపాలెం భూముల వ్యవహారంలో మేయర్ జిపిఎ తీసుకున్న విషయంలో ఆ భూములు ఎవరికీ విక్రయించే పరిస్థితి లేదని వివరించారు. అయినా ఆమె అవగాహన లేక చేసిన పని కాబట్టి జిపిఎ రద్దు చేసుకోవడం జరిగిందన్నారు. భూఆక్రమణల వ్యవహారంలో తాను ఎవరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. ఈ విషయం తాను కలెక్టర్, ఎస్పీలకు కూడా చెప్పడం జరిగిందన్నారు. ఒంగోలులో అనేక భూ ఆక్రమణకేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుదాస్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని, గతంలో చెరువుకొమ్ముపాలెం వద్ద కూడా ఆయన దళితులను ఇబ్బంది పెడుతుంటే తాను స్వయంగా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి అతనిమీద చర్యలు తీసుకోవాలని పోలీసులకు చెప్పడం జరిగిందన్నారు. ప్రభుదాస్ ఎక్కడ ఉన్నా పట్టుకొని అతను చేసిన మోసాలను బయటపెట్టి, కేసు నమోదు చేసి.. జైలుకు పంపుతామని చెప్పారు.

జనార్ధన్ ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారు..

మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఫ్రస్టేషన్‌లో ఏదేదో మాట్లాడుతున్నాడని బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. బహుశా టిడిపి, జనసేన అలవెన్సులో ఒంగోలు టిక్కెట్ జనసేనకు ఇవ్వాల్సి వస్తుందనే ఫ్రస్టేషన్‌లో ఆయన అర్ధంపర్ధం లేని ఆరోపణలు చేస్తున్నాడని వివరించారు. అధికారంలోకి వస్తే తన అంతు చూస్తానని పదే పదే చెబుతున్నాడని, ఆ విషయం పక్కన పెడితే రానున్న రోజుల్లో తాను ఒంగోలులో ఇద్దరిని మాత్రం వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. జనార్ధన్ పక్కన ఓ ఐరన్ లెగ్ చేరాడని, ఆయన ఎప్పటి నుంచో తన ఓటమిని కోరుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. ఆ ఇద్దరు ఎవరని విలేకర్లు ప్రశ్నించగా బాలినేని శ్రీనివాసరెడ్డి వారి వివరాలను వెల్లడించలేదు. పార్టీలకు అతీతంగా సాయం చేసే మనస్తత్వం తనదని తెలిపారు. జనార్ధన్ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు సొంత పార్టీ కాంట్రాక్టర్ ఇంటినే కూల్చి వేయించాడని, అనేక మంది టిడిపి వాళ్లను ఇబ్బంది పెట్టారని వ్యాఖ్యానించారు. భాగ్యనగర్‌లో తన సోదరి ఇంటి స్థలం విషయంలోనూ మున్సిపాలిటీని అడ్డంపెట్టుకొని టిడిపి వాళ్లు కొంత స్థలం ఆక్రమణలకు పాల్పడ్డా.. తాను ఇప్పుడు అధికారంలో ఉండి కూడా పట్టించుకోలేదన్నారు. డిపో దగ్గర వెంకటరమణ హాస్పిటల్ నిర్మాణానికి తాను సాయపడ్డానని తెలిపారు. వారు ఏ పార్టీ? అని విలేకరులను ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు తప్ప తాను ఎప్పుడూ పార్టీలను చూసిన పాపాన పోలేదన్నారు.

క్రికెట్ మ్యాచ్‌నూ రాజకీయం చేశారు..

ఆస్ట్రేలియా, ఇండియా వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రజలకు చూపించేందుకు తాము మినీస్టేడియంలో బిగ్ స్క్రీన్ ఏర్పాటుచేస్తే దాన్ని కూడా జనార్ధన్ రాజకీయం చేసి మాట్లాడుతున్నాడని బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. తన డబ్బులు ఖర్చుచేసి తాను ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటే జనార్ధన్‌కు వచ్చిన నష్టం ఏంటని ప్రశ్నించారు. చివరికి క్రికెట్‌ను రాజకీయం చేసి, ఇండియాను అవమాన పరిచేలా వారి చేష్టలు ఉన్నాయని బాలినేని తెలిపారు. వందల కోట్లు పెట్టి రిమ్స్ ఆసుపత్రి తాను కట్టిస్తే కేవలం మూడు లక్షల రూపాయలతో ఆర్వో ప్లాంటు పెట్టి దానికి పచ్చరంగులు వేసి వాళ్ల తాత ఫోటో, ఆయన ఫోటో పెట్టుకొని రిమ్స్ ఆసుపత్రేదో తెలుగుదేశం పార్టీ వాళ్లు నిర్మించినట్లు కలరింగ్ ఇచ్చిన వ్యక్తి జనార్ధన్ అని బాలినేని విమర్శించారు. అనంతరం పలువురికి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన రూ.63 లక్షల విలువైన చెక్కులను బాలినేని అందజేశారు. సమావేశంలో వైసిపి నగర కన్వీనర్ కటారి శంకర్, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గోలి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.